సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 15 । నవంబర్ । 2023



లోతుగా దర్యాప్తు చేయండి

బెనర్జీపై జరిగిన హత్యాయత్నానికి తన అనుచరులే పాల్పడ్డారని టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ అంగీకరించాడని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రాదరెడ్డి పేర్కొన్నారు. -8లో



వాలంటీర్ హత్య కేసులో ఇద్దరు అరెస్ట్

కడపలో ఈ నెల 12వ తేదీన వాలంటీర్ భవానీ శంకర్‌ను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.9 /22.7

వాతావరణం

జిల్లాలో మంగళవారం 22.7 – 31.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామస్వామి హుండీ లెక్కింపు ఆలయ రంగమండపంలో మంగళవారం జరిగింది. రూ.5,79,140 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

'శ్రీవివేకానంద'కు అటానమస్ హోదా

వైవీయూ: కడప నగరం పక్కీరుపల్లెలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, నిబంధనలు అనుసరించి నిర్వహణ అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ హోదా కల్పించ్చారు. కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ డా.ఎస్.పి.మధుసూధన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

'108'లో ఉద్యోగాలు

కడప రూరల్: 108 అంబులెన్స్ సర్వీసెస్‌లో ఈఎంటీ(ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్స్) ఉద్యోగాల ఉన్నాయని జిల్లా మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీజెడ్‌సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం విద్యార్హతగలవారుంటే ఈ నెల 15, 16వ తేదీల్లో కడప పాత రిమ్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

పరికరాల పంపిణీ వేగవంతం

కడప అగ్రికల్చర్: జిల్లాలో అర్హత కలిగిన రైతులకు డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కడపలోని ఏపీఎంఐపీ కార్యాలయంలో అధికారులు, కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి 10,500 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. అవసరమున్న రైతులు ఆర్‌బీకేల్లో త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వైవీయూలో ఆనర్స్ డిగ్రీ కోర్సు

వైవీయూ: యోగి వేమన విశ్వ విద్యాలయం పీజీ కళాశాలలో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలో మంగళవారం జరిగిన జాతీయ నూతన విద్యా విధానం–2020 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 డిగ్రీ కళాశాలల్లో ఆనర్స్ నాలుగేళ్ల కోర్సులో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.yvu.edu.inలోకి వెళ్లి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 25వ తేదీలోగా వైవీయూలో సమర్పించాలని సూచించారు.

పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

కడప కల్చరల్: పిల్లలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉషారాణి పేర్కొన్నారు. కడప పరిధిలోని కొండాయపల్లి కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. నేతల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది నవంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ నాడు గ్రంథాలయాలు అక్షర జ్ఞానాన్ని నింపి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేశాయన్నారు. అంబవరం ప్రభాకర్ రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, అమీరుద్దీన్ పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

కడప ఎడ్యుకేషన్: భావి భారత శాస్త్రవేత్తలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర జ్యూరీ సభ్యుడు డాక్టర్ పత్తి వెంకటక్రిష్టారెడ్డి అన్నారు. స్థానిక నగర పాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ మంగళవారం ఘనంగా ముగిసింది. పలువురు విద్యార్థులు 115 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటి నుంచి ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికచేశారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త డీవీ.సుబ్బనాయుడు మాట్లాడుతూ పిల్లలలో దాగిన సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ పోటీ సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెహమాన్, గునిశెట్టి శ్రీనివాసులు, అడమిక్ సమన్వయకర్త శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాలల సైన్సు కాంగ్రెస్‌లో విజేతలుగా లోకేష్(మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్) సురేష్‌బాబు(కల్లూరు జెడ్పీ హైస్కూల్), ఇలియాస్(నల్లపురెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్) వేణుగోపాలరావు(పొద్దుటూరు డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్) సందీప్(రామనపల్లె జెడ్పీ హైస్కూల్), ఆయాన్(పల్లవోలు ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్)లు నిల్వగా వారికి అతిథులు ధ్రువపత్రాలు అందజేశారు.

రహదారులకు కొత్త రూపు



వేంపల్లెలో రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రూ. 47.08 కోట్లతో ఎండీఆర్ రోడ్డును విస్తరించేందుకు పనులు చేపట్టారు. ఆక్రమణలు తొలగించే పనులు కొనసాగుతున్నాయి. టౌన్‌లో రూ.13.50 కోట్లతో విస్తరణ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి.



పులివెందులలో సర్వాంగ సుందరంగా తయారైన ఔటర్ రింగ్ రోడ్డు



కడప నగరంలో రూ.120.80 కోట్లతో మూడు రోడ్ల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రూ.18 కోట్లతో అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై–జంక్షన్ వరకు, రూ.14.50 కోట్లతో అన్నమయ్య సర్కిల్ నుంచి గోకుల్ లాడ్జి వరకు రూ.56 కోట్లతో కృష్ణా సర్కిల్ నుండి దేవుని కడప వరకు పనులు చేపట్టారు.

- జిల్లాలో కోట్ల రూపాయలతో రహదారుల విస్తరణ
- ముమ్మరంగా సాగుతున్న భవన నిర్మాణ పనులు

కడప సిటీ: అభివృద్ధికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దశల వారీగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి రహదారులను విస్తరిస్తోంది. ఇప్పటికే జిల్లాలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు పలు చోట్ల కొనసాగుతున్నాయి. నాడు–నేడు కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులు, జరుగుతున్నాయి.

- వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయలతో జిల్లా వ్యాప్తంగా రహదారులను విస్తరిస్తోంది. 2147 కిలోమీటర్ల మేర మేజర్ డెవలప్‌మెంట్ రోడ్లను పునరుద్ధరిస్తోంది. రూ.5.49కోట్ల నిధులతో 159.80 కిలోమీటర్ల మేర చేపట్టిన రాష్ట్ర జాతీయ రహదారుల పనులు పురోగతిలో ఉన్నాయి. మరోవైపు పులివెందుల పట్టణంలో మోడల్ టౌన్ కింద పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రూ.50.13 కోట్లతో 12.56 కిలోమీటర్ల మేర రేడియల్ రోడ్లు, రూ.31.11 కోట్లతో రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి.

చేపట్టిన పనులివీ..

- రూ.10.20 కోట్లతో చేపట్టనున్న సీఎంఓ వర్క్ కింద మూడు స్టేట్ హైవే రోడ్డు మూడు పనులు, ఎండీఆర్ పరిధిలో రూ. 26.55 కోట్లతో ఐ ఇంపాక్ట్ వర్క్స్ కింద 13 పనులు టెండరు దశలో ఉన్నాయి.
- జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్లతో స్టాటప్ సెంటర్, రూ.13 కోట్లతో జేఎన్‌టీయూ వర్సిటీలో లెక్చరర్ హాల్, రూ.36 కోట్లతో తొండూరులో వెనుకబడిన తరగతుల బాలికల పాఠశాల భవనం, రూ.87.50 కోట్లతో మోడల్ టౌన్ కింద అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం ఇవి వేగంగా జరుగుతున్నాయి. రూ.30 కోట్లతో చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల భవనం, రూ. 26.12 కోట్లతో స్పోర్ట్స్ బిల్డింగ్ కాంప్లెక్స్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో రూ.21 కోట్లతో పులివెందులలో మినీ మండల సచివాలయ కాంప్లెక్స్ పనులు చేపట్టనున్నారు. ఎంపీ నిధులు రూ.5.65 కోట్లతో కడపలో బీసీ భవన్ నిర్మాణపనులు జరుగుతున్నాయి.
- ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో రూ.53 కోట్లతో ప్రొద్దుటూరు నుంచి ఆర్టీపీపీని కలిపే పెన్నానదిపై వంతెన నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పునాదుల పనులు జోరుగా సాగుతున్నాయి.
- పులివెందులలో మోపూరు దేవాలయాలు, కుప్పం–కల్లూరుపల్లె రోడ్డు వైపు రూ.38 కోట్లతో రెండు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాయలాపురంలో రూ. 7 కోట్లతో నాలుగు వరుసల బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.
- ఎస్‌హెచ్‌ఎండీఆర్ లోన్ వర్క్స్ కింద రూ.35.80 కోట్లతో 82.617 కిలోమీటర్ల మేర 17 రాష్ట్ర జాతీయ రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టారు. రూ. 99.21 కోట్లతో 282.719 కిలోమీటర్ల మేర జిల్లా ఇతరపనులు ఇప్పటికే పూర్తయ్యాయి.
- నాడు–నేడు కింద రూ.43.25 కోట్లతో 51 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బీపీహెచ్‌యూ పనులు కొనసాగుతున్నాయి. రూ.1.278 కోట్ల విలువజేసే ఆరు బెడెడ్ ఫెసిలిటీస్ కింద పీహెచ్‌సీ పనులు చేపట్టారు.
- రూ.54.85 కోట్లతో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) కింద , రూ.132.30 కోట్లతో 88.55 కిలోమీటర్ల మేర సెంట్రల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రూ.22.80 కోట్లతో ఏడు వంతెనలు మంజూరుకాగా, మూడు వంతెన పనులు ఇంకా జరుగుతున్నాయి.

పనుల వేగవంతానికి చర్యలు



జిల్లాలో ఆయా ప్రాంతాల్లో రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులు వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. అంతే కాకుండా రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో రోడ్డు పనులేగాక, భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు జరుగుతున్నాయి. - వి.విజయరామరాజు, కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. మరిన్నిచోట్ల పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పులివెందులలో ఔటర్‌రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు పూర్తయ్యాయి. కడప నగరంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. - మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ, కడప

అభివృద్ధి పనులు వేగవంతం

- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తూ రానున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాల్‌లో జేసీ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి అభివృద్ధి పనులపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి నోడల్ ఆఫీసర్ల ఎంపిక, ఎలెక్షన్ ఫామ్స్‌పై సమీక్ష, ఇతర పనులపై ఆయన చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ ఆఫీసర్లు.. సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు అవసరమైన ఇంజినీరింగ్ టీమ్‌ను ఎంపిక చేయాలన్నారు. తహసీల్దార్లు పోలింగ్ స్టేషన్ల వద్ద సదుపాయాలు కల్పించాలన్నారు. డీఆర్వో ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ల బడ్జెట్ నిర్వహణ ఉంటుందన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూములను సిద్ధం చేసుకోవాలన్నారు. జంక్ క్యారెక్టర్స్, అద్దె ఇంట్లో నివాసాలు, వలసబోయిన వివరాలు మరోమారు పరిశీలించాలన్నారు.

- క్యాస్ట్ బేస్ట్ సర్వే సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయిలో స్టేక్ హోల్డర్స్ మీటింగ్ నిర్వహించు కోవాలన్నారు. వలంటీర్ల ద్వారా 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు.
- డిసెంబర్ 15వతేదీ నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించామని, నవంబర్ 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. 21న క్రీడా మెటీరియల్స్ అందజేస్తామన్నారు.
- 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహణలో భాగంగా ఏయే పథకాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందారనే వివరాలను తెలుపుతూ బోర్డులను సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

వైఎస్ కుటుంబంతోనే అభివృద్ధి సాధ్యం

చక్రాయపేట: వైఎస్ కుటుంబానికే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం సాధ్యపడుతుందని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. చక్రాయపేటలో సచివాలయం ఆర్బీకే, మోడల్ పోలీస్ స్టేషన్ హవనాలను మండల ఇన్‌ఛార్జి వైఎస్.కొండారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. నెరుసుపల్లెలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రేన్ సాయంతో గజమాల వేసి ఎంపీ అవినాష్‌రెడ్డి, తదితరులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పదాన్ని అంతా మాటల్లో వాడుతారని, వైఎస్ కుటుంబం దాన్ని చేతల్లో చూపుతోందని చెప్పారు. గత కొన్ని దశాబ్దాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ వచ్చిన కుప్పం–కె.రాజుపల్లె మధ్య పాపాఘ్ని నదిలో వంతెన నిర్మాణం జగనన్న చొరవతో కార్యరూపం దాల్చిందని చెప్పారు. అద్దాలమర్రి వద్ద హైలెవల్ వంతెన పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఒక పక్క సంక్షేమ ఫలాలను బటన్ నొక్కి ప్రజల ఖాతాలకు జమచేస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులను వేగవంతం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. చక్రాయపేట మండలంలో అన్ని చెరువులను నీటితో నింపి ప్రతి ఎకరాకూ నీరందిస్తామన్నారు. కాలేటి వాగు ప్రాజక్టు పనులు పూర్తిచేసి రైతన్నల కలలు సాకారం చేస్తామన్నారు. గండి క్షేత్రంలో రూ.20 కోట్లతో ఆలయ పనులు జరుగుతున్నాయని చెప్పారు. మాధవీ బాలకృష్ణ, శివప్రసాదారెడ్డి, వెంకట సుబ్బయ్య, లీలావతి, మోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, ప్రసాదరావు, హర్షాద్, మునిరత్నంరెడ్డి పాల్గొన్నారు.



చక్రాయపేట పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, వైఎస్.కొండారెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకుల చేరిక



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని.. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వేముల మండలం రాచకుంటపల్లె గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రగొర్ల జగదీష్, శివారెడ్డి, రవి, గంగాధర్‌లతోపాటు పది కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వేముల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, మరకా శివకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలికాలం.. జర భద్రం


జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. రెండు, మూడు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆహారపానీయాలు, దుస్తులు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులు చెబుతున్నారు.

- క్రమంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మెల్లగా పెరుగుతున్న చలి
- ఆహారవిహారాల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్న నిపుణులు



సాక్షి, కడప డెస్క్: చలికాలం మొదలైంది. రెండు, మూడు నెలలపాటు వణుకు పుట్టిస్తుంది. వాతావరణంలో అనేక మార్పులు వస్తాయి. ఆరోగ్యంపై ఏ మాత్రం అలక్ష్యం వహించినా రోగాల బారిన పడక తప్పదు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులున్న వారు చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. చలి కాలంలో సాయంత్రం నుంచి వీలైనంత వరకు ఇంట్లోనే ఉండే ప్రయత్నం చేయాలి. ఇక ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఫ్రిజ్‌లో ఆహారం తినవద్దు



చలికాలంలో మనం తీసుకునే ఆహారం పట్ల జాగ్రత్తలు వహించాలి. ఫ్రిజ్ లో వుండే ఐటమ్స్ అస్సలు తినరాదు. కేవలం వేడిగా ఉండే ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. చలికాలంలో మద్యంతో పాటు టీ, కాఫీలను అధికంగా తాగుతారు కొందరు. ఇలా అస్సలు చేయరాదు. మద్యానికి దూరంగా ఉండాలి. టీ, కాఫీ రోజుకు రెండు మూడు కప్పులు తీసుకోవచ్చు. అలాగే కషాయాలు, హెర్బల్ టీలను తాగవచ్చు. దీంతో శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉంటుంది. తగినంత నీటిని తీసుకుంటే ద్రవాలు అంది జీవక్రియలు సరిగ్గా ఉంటాయి. చలికాలంలో జ్వరం, దగ్గు, జలుబు వంటివి మూడు రోజులకు మించి వేధిస్తుంటే వెంటనే డాక్టర్‌ను కలవాలి.

ఆస్తమా ఉందా.. తస్మాత్ జాగ్రత్త



ఆస్తమా ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, చేపలు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోరాదు. కూల్ డ్రింక్స్, ఉప్పు అధికంగా వున్న పదార్థాలు.. ప్యాక్డ్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తీసుకోరాదు. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా వున్న పదార్థాలు తీసుకోవాలి. రెండు చెంచాల వెల్లుల్లి, అల్లం కలిపిన టీ, వేడి నీటిలో తేనె కలుపుకుని రోజూ తీసుకుంటే వ్యాధిని నియంత్రించుకోవచ్చు. మెంతులు వేడినీటిలో తడిపి, వెల్లుల్లి రసం అరస్పూన్, తేనెను కలిపి రోజూ తాగితే ఉపశమనం పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

గుండెకు చలి తిప్పలు



వాతావరణంలో వచ్చే మార్పులు శరీరంపై రకరకాల ప్రభావాల్ని చూపిస్తాయి. చలికాలంలో హార్ట్ పేషెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ కాలంలో అడ్రినలిన్, నారిటలిన్ వంటి కొన్ని హార్మోన్ల లెవల్స్‌లో మార్పులొస్తాయి. ఇవి రక్తప్రసరణలో మార్పులు తెస్తాయి. అలాగే చలి కాలం రక్తనాళాలు సహజంగా ముడుచుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటప్పుడు కొలెస్ట్రాల్ వంటి సమస్యలు పెరిగే ప్రమాద ముంది. కాబట్టి చలి కాలం గుండె సమస్యలున్నవాళ్లు వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తుండటం ద్వారా రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చూసుకోవచ్చు.

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే..


రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు ముఖ్యమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లరాదు. ఇంటి లోపలి ప్రదేశాలు వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలు, తలుపులను కచ్చితంగా మూసేయాలి. రూమ్ హీటర్లను వాడటంతో వెచ్చగా ఉండవచ్చు. పండ్లు, కాయగూరలు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇన్ఫెక్షన్లు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. అస్తమా సీఓపీడీ, బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాస కోశ సమస్యలుంటే జాగ్రత్తగా ఉండాలి. కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, ఐస్ వాటర్‌కు దూరంగా ఉంటే మంచిది. ఏసీ గదుల్లో ఎక్కువసేపు ఉండరాదు.

పెదాలు, కురులపై శ్రద్ధ అవసరం



చలి కాలంలో పెదాలు పగలకుండా ఉండాలంటే టిప్స్ పాటించాలి. పొడిగా వదిలేయకుండా, నాణ్యత కలిగిన లిప్ లోషన్ పెదాలకు అప్లై చేయాలి. బి విటమిన్‌తో పాటు, ఎక్కువ నీరు తీసుకుంటే పెదాలు పొడి బారకుండా ఉంటాయి. ఈ కాలంలో రంగులు ఉపయోగించడంతో కురులు పొడిగా మారి అలర్జీకి కారణమవుతాయి. చర్మంపై దద్దుర్లకు దారి తీస్తాయి. మూడు రోజులకోసారి తలస్నానం చేస్తే సరిపోతుంది.

వ్యాయామం తప్పనిసరి



చలి వేస్తే చాలు.. వ్యాయామానికి స్వస్తి చెప్పి దుప్పట్లో దూరిపోతారు. మరింత మంది ఎక్కువగా చలిలో వ్యాయామం చేస్తారు. కానీ ఈ సీజన్‌లో జాగ్రత్తలతో వ్యాయామం చేయడం తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని నిపుణులు చెబుతున్నారు.

నిపుణులతో చికిత్స అవసరం

చలికాలంలో రకరకాల వ్యాధులు చుట్టుముట్టడం సహజం. ఆహారం, దుస్తులు తదితర విషయాల్లో జాగ్రత్త ఎంత అవసరమో.. అనారోగ్యం బారిన పడినపుడు తమకు తోచిన వైద్యం చేసుకోకపోవడం అంతే మంచిది. సమస్యను బట్టి వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. సొంత వైద్యం చేసుకోవడం మంచిది కాదు.

వస్త్రమే ఆయుధం



చలి నుంచి రక్షించుకోవడానికి దుస్తుల విషయంలో కచ్చితంగా మార్పులు చేసుకోవాలి. వెచ్చని అనుభూతి అందించే దుస్తులు ఇప్పుడు మార్కెట్‌లో కొలువుదీరాయి. పలుచని దుస్తులను వేస్తే కచ్చితంగా రెండేసి చొప్పున ధరించాలి. అలాగే ఉన్నితో తయారుచేసిన స్వెటర్లు, మంకీ క్యాప్స్, స్కార్ఫ్‌లు, చేతులకు గ్లోవ్స్ ఇంకా కాళ్లకు సాక్స్ ధరించాలి. ఎందుకంటే ఇవి మనల్ని వెచ్చగా ఉంచి చలి బారి నుంచి సంరక్షిస్తాయి. దీంతో పాటు పొడిగా ఉండే దుస్తులను మాత్రమే ధరించాలి. దుస్తులు తడిగా ఉంటే మనం అధిక చలిని ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే శరీరం తడిగా ఉన్నా కూడా ఎక్కువ చలిగా అనిపిస్తుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలంలో సహజంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. జలుబు, దగ్గు త్వరగా దాడి చేస్తుంటాయి. ఆహారం అరుగుదల తక్కువ. వీటిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలి. గుడ్లు, చేపలు శరీరానికి తప్పక అవసరం. వేడిగా వండిన వంటలే ఉత్తమం. జామ, దానిమ్మ, బొప్పాయి, అరటిపండ్లు మంచివి. - డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్, ఆర్టీసీ ఏరియా ఆస్పత్రి, కడప

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి



పిల్లలు సాయంత్రం ఆటలాడటానికి బయటకెళ్లినపుడు అప్రమత్తంగా ఉండాలి. చలి ప్రభావం వీరిపై అధికంగా ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇబ్బందులు వారికి తొందరగా చుట్టుముడతాయి. చీకటిపడే వరకు పిల్లలను బహిరంగ స్థలాల్లో ఆడించకపోవడమే మంచిది. కాచి చల్లార్చిన నీటిని అందివ్వాలి. - డాక్టర్ కరుణాకర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, రిమ్స్, కడప

క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ తుషార్ డూడీ

ముద్దనూరు : అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పకుంటే తీవ్ర పరిణామాలుంటాయని జిల్లా అదనపు ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా వుంచామని తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే క్షమించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడితే పట్టణ బహిష్కరణ



కౌన్సెలింగ్ ఇస్తున్న అడిషనల్ ఎస్పీ కృష్ణారావు

ప్రొద్దుటూరు క్రైం : బెదిరింపులు, అల్లర్లకు పాల్పడే రౌడీషీటర్లను పట్టణ బహిష్కరణ చేస్తామని ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌కు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని చెప్పారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా ఎప్పటికీ ఉంటుందన్నారు. పోలీసులు పట్టించుకోరనే భ్రమలో ఎవరూ ఉండరాదని తెలిపారు. బెదిరిస్తున్నారని ఏ ఒక్కరూ ఫిర్యాదు చేసినా పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. స్టేషన్ పరిధిలోని 42 మందికి పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాతబైపాస్ రోడ్డులో వున్న అమృత్‌టీస్టాల్‌లో ఈనెల 12వ తేదీన రాత్రి సమయంలో పందికాళ్ల సాయికిరణ్ (25) అనే యువకుడిని కత్తితో దారుణంగా హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ నరసింహారెడ్డి వివరాలను వెల్లడించారు. కడప నగరం చిన్నచౌక్ ఏరియా శ్రీనివాసనగర్‌కు చెందిన చిట్టిబోయిన మహేంద్ర, పందికాళ్ల సాయికిరణ్ దగ్గర రూ. 50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును రెండు నెలల్లో ఇస్తాననీ తీసుకున్నాడనీ, తరువాత డబ్బులు ఇవ్వలేదనీ సాయికిరణ్, మహేంద్రను తరచుగా అడిగేవాడు. ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం అమృత్ టీస్టాల్ వద్ద మహేంద్రకు, సాయికిరణ్‌కు వాగ్వివాదం జరిగింది. అలాగే సాయికిరణ్ అమృత్‌టీ స్టాల్ యజమానికి టీలు, టీఫిన్‌లకు సంబంధించిన డబ్బులను బాకీ దాదాపు రూ.1500 అయ్యిందనీ, తరువాత ఇవ్వకుండా దాటవేస్తున్నాడనీ మహేంద్రతోపాటు మరో నిందితుడు ఉమ్మలరాజు శ్రీరామ్ కూడా సాయికిరణ్‌తో గొడవపడ్డాడు. రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు కలిసి మహేంద్రను కత్తితో కడుపులో పొడిచాడు. సాయికిరణ్‌ను దారుణంగా హత్యచేసిన ఇద్దరు నిందితుల కోసం కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆదేశాల మేరకు చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం కడప-రాజంపేట రహదారిలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నిందితులు ఇరువురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐతోపాటు, ఎస్ఐలు తులసీనాగప్రసాద్, రవికుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు రామసుబ్బారెడ్డి, శివకుమార్, కానిస్టేబుళ్లు పివి శ్రీనివాసులు, సి.సుధాకర్‌యాదవ్, ఎస్.పి రంతుబాష, నాగరాజు, ఏ.శివప్రసాద్, జి. గురుమూర్తిలను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.

పోలీసుల అదుపులో నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎన్.వి నాగరాజు

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 12న ఉదయం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం సముదాయంలోని ఇనిస్టిట్యూట్ కార్యాలయంలో ఓగదిలో వలంటీర్, ఎల్ఐసీ డిజిటలైజేషన్ ఉద్యోగి చిట్వేలి భవానీశంకర్‌ను.. అతని స్నేహితుడు, టీం లీడర్ గుజ్జలి మల్లికార్జున, ఆటోడ్రైవర్ రంజిత్‌కుమార్‌తో కలిసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన కడప నగరంలో తీవ్ర సంచలనం కలిగించింది. ఈ క్రమంలో నిందితులను ఈనెల 13న అరెస్ట్ చేసినట్లు సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు. నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. ఈ హత్య సంఘటన కేవలం మల్లికార్జున భార్య శైలజతో.. భవానీశంకర్ వివాహేతర సంబంధం కలిగి వున్నాడనీ తెలుసుకుని.. తనతోపాటు వున్న రంజిత్ కుమార్‌తో కలిసి తాను పని చేస్తున్న ఆఫీసుకు ఫోన్ చేసి భవానీశంకర్‌ను పిలిపించారు. అతను గదిలోకి రాగానే తలుపునకు గడియపెట్టి దారుణంగా కత్తికొడవలితో పొడిచాడు. హతుని శరీరంపై దాదాపు 10 కత్తికొడవలి పోట్లు వున్నాయని ప్రాథమిక విచారణలో తెలిసింది. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, సిద్దయ్య, సిబ్బందిని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.

లోతుగా దర్యాప్తు చేయండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : బెనర్జీపై హత్యాయత్నం కేసులో లోతుగా దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ప్రవీణ్ అరెస్టు సందర్భంగా పోలీసుల తీరు ఆక్షేపణీయమన్నారు. సోమవారం ఉదయం ప్రవీణ్ ప్రెస్‌మీట్ నిర్వహించి.. తన అనుచరులే హత్యాయత్నం సంఘటనకు పాల్పడ్డారని అంగీకరించాడని తెలిపారు. హత్యాయత్నం కేసులో ఉన్న భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు తనకు ముఖ్య అనుచరులని, భరత్‌కుమార్‌రెడ్డి ఆత్మరక్షణ కోసమే ఇలా చేశాడని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇంటి వద్ద నుంచి పార్టీ నాయకులతో కలసి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చినా పోలీసులు అడ్డుకోలేకపోయారన్నారు. ఆత్మరక్షణ కోసం ఈ పని చేసినా శిక్షలో మార్పు ఉంటుందేమో కానీ, శిక్ష మాత్రం తప్పదన్నారు. టీడీపీ అధికారంలో లేని రోజుల్లోనే ప్రవీణ్ ఇలా చేస్తున్నాడంటే నిజంగా వారి పార్టీ అధికారంలోకి వచ్చి ప్రవీణ్ ఎమ్మెల్యే అయితే ప్రజలను బతకనిస్తాడా అన్నారు. తన కుటుంబ విషయాలపై ప్రవీణ్ మాట్లాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత విషయాలు ప్రజలకు అవసరం లేదని అన్నారు. తన కుమారుడు ఆరోగ్యంగా తిరిగి వస్తాడా లేదా అని బెనర్జీ తల్లి బుజ్జమ్మ ఎదురు చూస్తోందన్నారు.

బెనర్జీ కుటుంబ సభ్యులకు బెదిరింపులు

హత్యాయత్నం కేసు నుంచి టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేరును తొలగించాలని కొంత మంది.. బెనర్జీ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి బెదిరించారన్నారు. రూ.20 లక్షలు ఇస్తామని.. ప్రవీణ్ పేరును తొలగించాలని, లేకుంటే టీడీపీ గవర్నమెంట్ వచ్చిన తర్వాత మిమ్మల్ని ఎవరు కాపాడలేరని బెదిరించారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, వరికూటి ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

బహుళార్థ సాధక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుబాషిణి

కడప అగ్రికల్చర్ : సహకార సంఘాలను బహుళార్థ సాధక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కో- ఆపరేటివ్ అధికారి సుబాషిణి పేర్కొన్నారు. మంగళవారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు కార్యక్రమాన్ని కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సహకార వ్యవస్థలో జరిగిన మార్పులను గ్రామీణ ప్రజల దృష్టికి కూడా తీసుకెళ్లాలని, ప్రతి ఒక్క సహకార ఉద్యోగి ఇందులో పాలు పంచుకోవాలని సూచించారు. ఎన్నడూ లేని విధంగా సహకార సంఘాలకు పెట్రోల్ బంకులు, జనరిక్ ఔషధ కేంద్రాలు మంజూరు అవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ శాఖలో అంతర్గతమైన సహకార శాఖను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీసీఏఓ అరుణకుమారి మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే ఈ సహకార వారోత్సవాల్లో ఒక్కొక్క అంశం మీద ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిటిఐ ప్రిన్సిపాల్ నారాయణస్వామి, డీఆర్ఓఎస్డీ గురప్ప, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజరావు, బ్యాంకు జనరల్ మేనేజర్ రాజామణి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ప్రతాప్‌రెడ్డి ఇతర బ్యాంకు సిబ్బంది, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

కబడ్డీ చాంపియన్‌లకు అభినందన



ట్రోఫీని వీసీ, రిజిస్ట్రార్‌కు చూపుతున్న క్రీడాకారులు

వైవీయూ : దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం, ట్రోఫీ సాధించిన వైవీయూ కబడ్డీ జట్టును వైవీయూ అధికారులు అభినందించారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో 113 విశ్వవిద్యాలయాలు, 1300 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వైవీయూ జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచింది. దీంతో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీలో నిర్వహించే ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పురుషుల చాంపియన్‌షిప్-23కు అర్హత సాధించింది. వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి క్రీడాకారులను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచూకీ తెలపరూ..!



శ్రీనివాసులు(ఫైల్)

పులివెందుల రూరల్ : తమ కుమారుడి ఆచూకీ తెలపాలని పార్వతమ్మ కోరారు. ఆమె మంగళవారం విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకుంది. పులివెందులలోని సరస్వతి విద్యా మందిరం వెనుక భాగంలో నివాసముంటున్న తమ్మిశెట్టి వెంకటరాములు, పార్వతి కుమారుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు (35) మూడు వారాల నుంచి కనిపించడం లేదు. అతనికి కొంత కాలం నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పార్వతమ్మ తెలిపారు. ఎవరైనా అతన్ని గుర్తిస్తే వెంటనే 9390437013 అనే ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని ఆమె కోరారు.

పోలీసుల ఆధ్వర్యంలో ప్రేమవివాహం

చాపాడు : మొర్రాయిపల్లె గ్రామానికి చెందిన బేరి మేఘన, ఇదే గ్రామానికి చెందిన రావలూరు సుధీర్‌కుమార్ మంగళవారం పోలీసుస్టేషన్ వద్ద గల దేవాలయంలో వివాహం చేసుకున్నారు. ఎస్ఐ మైనుద్దీన్ తెలిపిన వివరాల మేరకూ.. సోమాపురం గ్రామ సచివాలయ వలంటీరుగా పని చేస్తున్న మేఘన, రావలూరు సుధీర్ గత కొన్ని నెలలుగా ప్రేమించుకుంటున్నారు. వారం రోజుల క్రితం వలంటీరు మేఘన కనిపించకపోవటంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేఘన, సుధీర్‌తో వెళ్లినట్లు పోలీసులు తెలుసుకుని, వారిని మంగళవారం పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇద్దరు మేజర్లు కావటంతో.. కుటుంబీకులను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో వారి సమక్షంలో పోలీసుల ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద వివాహం చేసుకున్నారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా



డివైడరు పైకి ఎక్కి బోల్తా పడిన ట్రాక్టరు

అట్లూరు : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్డు ఎరుకల బావి సమీపాన లారీ ఢీకొని ట్రాక్టరు బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. బద్వేలు నాలుగురోడ్ల కూడలి నుంచి కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టరును వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ట్రాక్టరు డివైడరు పైకి ఎక్కి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మైపాడు బీచ్‌లో మునిగి యువకుడి మృతి

ఇందుకూరుపేట : స్నేహితులతో సరదాగా సముద్రంలో మునిగేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని మైపాడు బీచ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణానికి చెందిన సయ్యద్ జావీద్(26) కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి తొమ్మిది మంది కారులో సేదతీరేందుకు మైపాడు బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో అలల ఉధృతికి జావీద్ నీటమునిగి గల్లంతయ్యాడు. సహచరులు తీవ్ర ఆవేదనతో తీరం వెంట వెతుకుతూ ఉండిపోయారు. సుమారు గంట సేపటికి జావీద్ విగతజీవిగా మారి ఒడ్డుకు చేరుకున్నాడు. దీంతో బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విద్యా, వసతి దీవెన లబ్ధికి ఉమ్మడి ఖాతా ఉండాలి

కడప రూరల్ : అర్హులైన విద్యార్థులు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద లబ్ధి పొందేందుకు ఉమ్మడి ఖాతా కలిగి ఉండాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. 2023 నవంబరు 10వ తేదీన ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం విద్యాదీవెన, వసతి దీవెన పొందేందుకు అర్హులైన డిగ్రీ, పీజీ, డిప్లొమా, ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయని తెలిపారు. ఇకపై ఆ పథకాల కింద లబ్ధి పొందేందుకు ప్రతి విద్యార్థి వారి తల్లుల కొత్త ఉమ్మడి ఖాతాలో ప్రభుత్వం నగదును జమ చేస్తుందన్నారు. ఆ మేరకు ఉమ్మడి బ్యాంకు అకౌంటు చేసుకోవాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి చెందిన ఫైనల్ విద్యార్థులు, ఎస్సీ విద్యార్థులకు మినహాయింపు ఉందన్నారు.

- కొత్త జాయింట్ అకౌంట్ చేసుకునేందుకు బ్యాంకులకు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఖాతా జీరో బ్యాలెన్స్‌ను కలిగి ఉంటుంది. జాయింట్ అకౌంటులో విద్యార్థి మొదటి అకౌంటు హోల్డర్‌గా, రెండవ అకౌంట్ హోల్డర్‌గా విద్యార్థి తల్లి ఉంటుంది. తల్లి మరణించినట్లయితే తండ్రితో జాయింట్ అకౌంటు చేసుకోవాలి. తల్లీదండ్రులు లేనట్లయితే గార్డియన్‌తో అకౌంట్ చేసుకోవాలి.
- అకౌంట్ కోసం విద్యార్థి, తల్లి మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఇద్దరి ఆధార్‌కార్డు కాపీలను బ్యాంకుకు సమర్పించాలి.
- తల్లి ఆధార్ వివరాలను కేవలం అడ్రస్ కోసం మాత్రమే బ్యాంకు సిబ్బంది ఉపయోగించాలి.
- ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ సరిగా పొందుపరిచినట్లయితే తేదీ కోసం స్టడీ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. స్టూడెంట్ కాలేజీ ఐడీ కార్డును పొందుపరచాలి.
- ఉమ్మడి బ్యాంకు ఖాతాను చేసుకున్న తర్వాత అకౌంట్ కాపీని సచివాలయంలో ఇచ్చి పోర్టల్‌లో బ్యాంకు వివరాలను అప్‌లోడ్ చేయాలి. ఈ అకౌంటు ఓపెన్ ప్రక్రియను ఈనెల 24వ తేదీ లోపు పూర్తి చేయాలి.

డీఏవీ 'భారతి' విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, ప్రిన్సిపల్

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) లోని డీఏవీ భారతి విద్యార్థులు ఇంటర్నేషనల్ ఒలంపియాడ్‌లో విజయ కేతనం ఎగురవేశారు. ఈ ఏడాదిలో సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పోటీల్లో పాల్గొన్న డీఏవీ భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయిలో 7, రాష్ట్ర స్థాయిలో 12 మంది విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. అలాగే తరగతుల వారీగా నిర్వహించిన పోటీల్లో 18 మంది బంగారు, 20 మంది వెండి, 16 మంది సిల్వర్ పతకాలు సాధించారు. కాగా మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిశ్రమ ప్రతినిధులు సుబ్బలక్ష్మి సాయి రమేష్ (కోర్ అడ్వైజర్), చీఫ్ మేనేజరన్ అడ్మిన్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ శివ్యాం కిషోర్ కుమార్‌లు విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోటీలో ఇలాగే విజయం సాధించాలని విజేతలకు సూచించారు. కాగా ప్లాంట్ సీఎంఓ సాయి రమేష్, డీఏవీ సౌత్ జోన్ ప్రాంతీయ అధికారి వీఎస్ఎన్‌కే శేషాద్రి విద్యార్థులను, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

నెలాఖరులోగా ఆర్సీ, డ్రైవింగ్ కార్డులు



జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ మీరాప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెలఖారులోగా వాహనాదారులకు ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను అందజేస్తామని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఈ.మీరా ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులో ఉన్న ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1,02,091 ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్సీ, డ్రైవింగ్ కార్డులు ప్రింటింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో.. తమ సిబ్బందితో మొత్తం కార్డులను సెలవు దినాల్లో కూడా ప్రింటింగ్ చేస్తున్నమన్నారు. 2021 సెప్టెంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు 54119 కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు 2021 నవంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు 47972 కార్డులు వాహనాదారులకు అందలేదని, వాటన్నింటిని ప్రింటింగ్ చేసి స్పీడ్ పోస్టు ద్వారా ఈ నెలఖారులోగా వాహనదారులకు అందజేస్తామని వివరించారు.

మినుము పంటను ఆశించిన పురుగు

- పలు చోట్ల ఆకులకు రంధ్రాలు
- ఆందోళనలో అన్నదాతలు



రాజుపాలెం మండలంలో మినుము పంట ఆకులకు పురుగుల ఉధృతితో పడిన రంధ్రాలు

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆరుతడి పంటల కింద బోర్లు, వర్షాధారం కింద 30,677.50 ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. గత కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా సాగు చేసిన మినుము పంట అక్కడక్కడా ఎండుముఖ పట్టింది. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈ తరుణంలో ఉపరితల ఆవర్తన కారణంగా కొన్ని రోజుల నుంచి జిల్లాలో పలు మండలాల పరిధిలో వర్షం కురుస్తోంది. దీంతో ఎండుముఖం పట్టిన మినుముపంట తిరిగి పచ్చదనంతో ఊగిసులాడుతుంది. దీంతో అన్నదాతల ముఖంలో చిరునవ్వు చిగురిస్తున్న తరుణంలోనే మినుముపంటకు శనగపచ్చ, గొంగళి పురుగు ఆశించింది. ఈ శనగపచ్చ, గొంగళి పురుగులు పంటకు సంబంధించిన ఆకులకు రంధ్రాలు వేసి పూర్తిగా తినేస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 12271 హెక్టార్లలో మినుము సాగు

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల పరిధిలో మినుము సాధారణ సాగు 9166 హెక్టార్లు కాగా ఈ ఏడాది 12271 హెక్టార్లలో పంట సాగైంది. సాధారణం కంటే అధికంగా 3105 హెక్టార్లలో మినుము పంట సాగైంది. ఇందులో జిల్లాలో అత్యధికంగా దువ్వూరు మండల పరిధిలో సాధారణ సాగు 540 హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 1943 హెక్టార్లలో సాగైంది. అలాగే కమలాపురం మండలంలో సాధారణ సాగు 908 హెక్టార్లు కాగా 1627 హెక్టార్లలో, వేముల మండలంలో సాధారణ సాగు 320.6 హెక్టార్లు కాగా 950 హెక్టార్లలో, చాపాడు మండలంలో సాధారణ సాగు 204 హెక్టార్లు కాగా 1293 హెక్టార్లలో , ఎర్రగుంట్లలో 464 హెక్టార్లు సాధారణ సాగు కాగా 984 హెక్టార్లలో , వల్లూరులో 376 సాధారణ సాగు ఉండగా 721 హెక్టార్లలో, సింహాద్రిపురంలో 252 సాధారణ సాగు కాగా 260 హెక్టార్లలో సాగైయింది. వీటితోపాటు పలు మండలాల పరిధిలో ఈ మినుము పంట సాగైయింది. సాగైన ఈ మినుము పంటకు శనగపచ్చ, గొంగలి పురుగులు ఆశించి ఆకులన్నీ తినేసి మొక్కను మోడు బారిస్తుందని పలువురు రైతులు తెలిపారు. ఈ పురుగులు రాత్రిపూట ఎక్కువగా తింటూ పగలు మొక్కల మొదల్లోను, భూమి నెర్రల్లోను చేరతున్నాయని చెప్పారు.

నివారణ చర్యలు ఇలా...



జిల్లాలో సాగు చేసిన మినుము పంటకు అక్కడక్కడా శనగ పచ్చ, గొంగళి పురుగు ఆశించింది. వీటి నివారణకు మెనోక్రోటోపాస్‌ను 1.6 మిల్లీమీటర్లు లేదా క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీలీటర్లు, లేక స్పైనోసాడ్ 0.3 గ్రాములు లేక పెన్వరేట్ 1 మిల్లీలీటర్ల లేక ఇమామెక్టిస్ బెంజోయేట్ 0.4 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ విషయంలో అన్నదాతలు నిర్లక్ష్యం చేస్తే దిగుబడిపై ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉంటుంది. కావున రైతులు తక్షణమే పురుగు మందులు పిచికారి చేసుకోవాలి. అప్పుడు పురుగు చనిపోయి పంట మళ్లీ ఏపుగా పెరుగుతుంది.

– డాక్టర్ వీరన్న, కృషి విజ్ఞానకేంద్ర ప్రధాన శాస్త్రవేత్త.